## దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్



దోమల నివారణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఎల్‌బీనగర్: వర్షకాలం దృష్ట్యా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. దోమల నివారణపై అధికారులు, సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల వల్ల వ్యాపించే రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ కూడా నీరు ఎక్కువ రోజులు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు డ్రైడే నిర్వహించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ అశోక్‌రెడ్డి, డీసీలు ముకుందారెడ్డి, అంజనేయులు, యాదయ్య, జాకీయ సుల్తాన, సుజాత, జోనల్ శానిటేషన్ ఇన్‌చార్జి సువార్త, సీనియర్ ఎంటమాలజీ రజినీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ వారాహీ దేవి నవరాత్రులు



ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠ శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో శ్రీవారాహీ దేవి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, శ్రీసౌందర్యలహరి పారాయణాన్ని నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ పూజలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిపల్లె శ్రీనివాస్, విఠల్ శర్మ, సాయికుమార్ శర్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు. దిల్‌సుఖ్‌నగర్

## తలసీమియా చిన్నారులకు రక్తదానం మన బాధ్యత

మన్సూరాబాద్: తలసీమియా వ్యాధి చిన్నారులకు రక్తదానం చేయటం మన బాధ్యతని జై భారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయవిహారం రమణమూర్తి అన్నారు. ఆజాద్‌షేక్ వర్ధంతి, ఖదీజ్జాసి ఆత్మసమర్పణ దీక్ష విరమణ సందర్భంగా ఎల్‌బీనగర్ సూర్యోదయనగర్ కాలనీలోని జైభారత్ ప్రధాన కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తలసీమియా సికిల్ సెల్ సొసైటీకి 65 యూనిట్ల రక్తాన్ని అందించారు. జైభారత్ ఉద్యమానికి ఆజాద్ షేక్ అందించిన స్ఫూర్తి గొప్పదని, హిందూ, ముస్లిం ఐక్యతకు జీవితాంతం పోరాటం చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ అధ్యక్షుడు సైరాషేక్, జాతీయ కార్యదర్శులు రజినీ, లోకనాథ్, ఉపాధ్యక్షులు వంశీ, వెంకన్న, జాతీయ నాయకులు మల్లీకావల్లభ, స్వామిత్రినాథ్‌దాస్, బోయ సుధాకర్, దుర్గారెడ్డి, గణేష్, పంబాల రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువత

## వరదనీటి కాలువలు ఏర్పాటు చేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: లోతట్టు కాలనీలలో మురుగు, వరద ముంపు సమస్య పరిష్కారానికి వరదనీటి కాలువలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజి, మైత్రిపురం కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు బుధవారం సర్కిల్ అధికారులతో కలిసి పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ, మురుగు సమస్యను పరిశీలించారు. త్వరలో ప్రత్యేక నిధులతో కర్మన్‌ఘాట్‌లోని భగత్‌సింగ్ యువజన సంఘం కార్యాలయం నుంచి శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాల రహదారి మీదుగా వైఎస్సార్ విగ్రహం వరకు, అదేవిధంగా చంపాపేట జామా మసీదు నుంచి మోడల్ మార్కెట్ వరకు వరద నీటి కాలువ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్కిల్ ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈ కార్తీక్, డీఈ రఫీ, ఏఈ సురేష్, నాయకులు సుంకరి రమేష్‌గౌడ్, దశరథగౌడ్, బసంత్, కాలనీ వాసులు సునీల్, హన్మంత్‌రెడ్డి, శ్రీశైలం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల మేనిఫెస్టోను అమలు చేస్తాం

దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య

చాదర్‌ఘాట్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రవేశపెట్టిన దివ్యాంగుల మేనిఫెస్టోను అమలు చేసి తీరుతామని రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. బుధవారం మలక్‌పేటలోని కార్యాలయంలో ఆయన చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, బల్మూరి వెంకట్‌లు హాజరై అభినందనలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరయ్య మాట్లాడుతూ, దివ్యాంగుల హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశానని, కాంగ్రెస్ పార్టీ గుర్తించి పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి, రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం కోసం నిరంతరం పాటు పడుతానని తెలిపారు. కార్యక్రమంలో జీఎం ప్రభంజన్‌రావు, ఏడీ రాజేందర్, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారానికి హాజరైన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

## మీ భూమి మీకే

బడంగ్‌పేట్: మిగిలి ఉన్న భూమి మీకే అని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి బడంగ్‌పేట దళితులకు హామీనిచ్చారు. బుధవారం బడంగ్‌పేటలోని దావుత్‌ఖాన్‌గూడలో సర్వేనెంబర్ 2లోని దళితుల భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారి బాధలు విన్న తర్వాత కేఎల్‌ఆర్ మాట్లాడుతూ.. తాతల నుంచి దున్నుకుంటున్న భూమికి మీరే వారసులన్నారు. మిగిలి ఉన్న భూములు మీకే చెందేలా కాంగ్రెస్ ప్రభుత్వం అభయం ఇస్తుందన్నారు. ఇందులో ఇళ్లు కట్టుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుందని ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత, కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, పుట్టగళ్ల జగన్, గుడ్ల శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, చిత్రం శ్రీను, కర్రె రమేశ్, ఉమేశ్, ముత్యాలు, రాములు, భూ బాధితులు ఉన్నారు.



బడంగ్‌పేట దళితులతో మాట్లాడుతున్న కేఎల్‌ఆర్

# తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

నగర శివారు ప్రాంతాల్లో విజృంభిస్తున్న దొంగలు

- భయంతో శివారు కాలనీ వాసులు
- ఉదయం రెక్కీలు.. రాత్రి చోరీలు



చోరీ ఇంట్లో చెల్లాచెదురుగా వస్తువులు(ఫైల్)

నాగోలు: నగర విస్తరణ పెరిగిపోవడంతో ప్రజలు నగర శివారు ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దొంగలు, నేరస్తులు రెచ్చిపోతున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా శివారు ప్రాంతాల్లో సరైన పోలీస్ వ్యవస్థ అందుబాటులో లేక పోవడం చోరీలకు అనువుగా మారిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీనగర్ డీసీపీ పరిధిలోని నగర శివారు ప్రాంతాల్లో దోపిడీలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకుని దోపిడీకి పాల్పడుతున్నారు. అంతర్ రాష్ట్ర దొంగలతో పాటు లోకల్ గ్యాంగ్‌లు కాలనీల్లో ఉదయం రెక్కీ నిర్వహిస్తు రాత్రి వేళ మారణాయుధాలతో తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారు. నాగోలు, హయత్‌నగర్, వనస్థలిపురం, అబ్దుల్‌పూర్‌మెట్, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో తరచుగా చోరీలు జరుగుతున్నాయి. దీంతో నగర శివారు కాలనీల ప్రజలు భయంతో వణికి పోతున్నారు.

- నాగోలు పోలీస్ స్టేషన్ పరిధి ఫతుల్లాగూడలోని గోల్డెన్ లీవ్స్ విల్లాస్‌లో గేటెడ్ కమ్యూనిటీలో రెండు విల్లాలో తాళం పగల గొట్టి చోరీ చేశారు. బంగారం, వజ్రాలు, నగదును అపహరించారు.
- నాగోలు పరిధిలోని జైపురికాలనీలో షిరిడీ సాయిబాబా ఆలయంలో ఓ వ్యక్తి భక్తుడు మాదిరిగా వచ్చి వెండి ఆభరణాలు చోరీ చేశాడు.
- నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో మల్లికార్జున హిల్స్‌లో ద్విచక్ర వాహనంపై వచ్చిన నిందితులు మహిళా మెడలో బంగారు గొలుసు తెంపుకుని పారిపోయారు.
- ఇటీవల అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విజయవాడ జాతీయ రహదారిపై చోరీలకు పాల్పడుతున్న నేరస్తులను పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులపై దాడులు చేసేందుకు నేరస్తులు తెగించడంతో పోలీసులు గాల్లో కాల్పులు జరపడంతో వారు లొంగిపోయారు.
- హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధి ప్రియదర్శిని కాలనీలో బంగారం, వెండి ఇతర ఆభణాలు చోరీ చేశారు.
- హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుల్‌మోహర్ ప్రజయ్ విల్లాల్లో వరుసగా దొంగతనాలు జరిగాయి.



### పని చేయని సీసీ కెమెరాలు

ఎల్‌బీనగర్ డీసీపీ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగా పనిచేయడం లేదు. జాతీయ రహదారి విస్తరణ పనులు జరగడం, గతంలో కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు చాలా ప్రాంతాల్లో సీసీ కెమెరాల వైర్లు తెగిపోయాయి. అధికారులు పట్టించుకోక పోవడంతో అవి పని చేయడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి సీసీ కెమెరాల మరమ్మతులు చేయాలని, కాలనీల్లో పోలీసుల నిఘా ఏర్పాటు చేయాలని వివిధ కాలనీ వాసులు కోరుతున్నారు.



చోరీ చేసేందుకు వచ్చి సీసీ కెమెరాలో రికార్డైన దొంగలు (ఫైల్)

### తాళం పగలగొట్టి చోరీ

నాగోలు: ఇంటి తాళం పగలగొట్టి ఆభరణాలు, నగదు చోరీ అయిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం .. హయత్‌నగర్ పరిధిలోని తట్టిఅన్నారం, వైఎస్సార్ కాలనీలో విజయ- సుదర్శన్ భార్యాభర్తలు నివసిస్తున్నారు. హయత్‌నగర్ కుంట్లూరు ప్రాంతంలో ఇటీవల వేసిన గుడిసెలో సుదర్శన్ గుడిసె వేసుకున్నాడు. మంగళవారం రాత్రి భార్యాభర్తలు ఇంటికి తాళం వేసి గుడిసె వద్దకు వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న 3 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ. 3.10 లక్షల నగదును దొంగలు అపహరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి వచ్చిన నిందితుడు తన సెల్‌ఫోన్‌ను అక్కడే వదిలేసి వెళ్లాడు. ఈ మేరకు పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

### అన్ని కాలనీల్లో నిరంతర నిఘా

అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో పోలీస్‌ల గస్తీ నిరంతరం ఏర్పాటు చేస్తున్నాం. రాత్రి సమయాల్లో శివారు ప్రాంతాల్లో పెట్రోలింగ్, గస్తీ మరింత చేపడుతాం. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 100 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. చోరీలను అరికట్టడానికి ప్రజలు కూడా సహకరించాలి.

ప్రవీణ్‌కుమార్, ఎల్‌బీనగర్ డీసీపీ

### కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్/ వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజారుల్లో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాట 43, వంకాయ 28, బెండ 40, పచ్చిమిర్చి 65, కాకర 28, బీరకాయ 38, క్యాబేజి 33, ఫ్రెంచి బీన్స్ 65, క్యారెట్ 35, దొండ 35, చిక్కుడు 80, గోకర 45, బీట్‌రూట్ 20, క్యాప్సికం 65, ఆలు 37, దోసకాయ 28, సొరకాయ 11, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 39, చామగడ్డ రూ. 35. గమనిక: ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధిత మరమ్మతు పనుల వల్ల చంపాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దుర్గాభవానీ నగర్, మాదన్నపేట ఫీడర్‌లలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినయ్‌నగర్ మెయిన్ రోడ్డు పరిసరాలలో, డీఎస్‌నగర్, ట్విన్ టవర్స్, సెంట్రల్ కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

### పాఠశాలలో విద్యార్థి నేతల ప్రమాణ స్వీకారం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ శ్రీ త్రివేణి పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిచర్ డేలో భాగంగా విద్యార్థుల ప్రమాణస్వీకారం, నూతన విద్యార్థి మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం కనుల పండువగా జరిగింది. పాఠశాల హెడ్‌బాయ్‌గా కార్తీక్, హెడ్‌గర్ల్‌గా మనస్వి, స్పోర్ట్స్ కెప్టెన్‌గా విఘ్నేష్, వైస్ కెప్టెన్లుగా బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించాలన్న ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ సునీల్, హెడ్‌మిస్ట్రెస్ యోగీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

హుడాకాంప్లెక్స్: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను జీహెచ్‌ఎంసీ అధికారులు తక్షణమే పరిష్కరించాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె ఎల్‌బీనగర్ ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ని మర్యాదపూర్వకంగా కలిసి డివిజన్‌లోని సమస్యలను వివరించి మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. జేబీ కాలనీలో అప్పటి నాలా పునఃరుద్ధరణ, దెబ్బతిన్న రోడ్డు ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకొని నిధులు మంజూరు చేయాలని కోరానని తెలిపారు. వీటితో పాటు నాలా పూడికలు, పారిశుద్ధ్యం, వీధికుక్కల సమస్యలకు క్రమం తప్పకుండా పరిష్కారం అందించాలని కోరినట్లు పేర్కొన్నారు.

## దశల వారీగా పార్కుల అభివృద్ధి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలోని పార్కులను దశలవారీగా అభివృద్ధి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేజ్ 1లో సంక్షేమ సంఘం భవనం మొదటి అంతస్తు ప్రారంభోత్సవం, ఫేజ్-2లో బీఎన్‌రెడ్డినగర్‌లో వాకింగ్ ట్రాక్, పార్కు సుందరీకరణ అభివృద్ధి పనులకు బుధవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు అనిల్‌చౌదరి, మాధవరం నర్సింగ్‌రావు, సామ బుచ్చిరెడ్డి, వెంకట్, ప్రభాకర్, గడ్డం మల్లేష్, మనోజ్, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

### ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీకి చెందిన సాయియాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలోని చాలా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, అదేవిధంగా మంచి నీటి, విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారులను పిలిపించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించాలని కాలనీవాసులు కోరారు. కార్యక్రమంలో రాజుగౌడ్, వెంకటేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలు



సివరేజీ వ్యవస్థను బ్లాక్ చేస్తుండగా అడ్డుకుంటున్న కార్పొరేటర్, కాలనీ వాసులు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ జోన్ జలమండలి అధికారులు మాముళ్ల మత్తులో ఉన్నారని, మాముళ్లు ఇవ్వని వారిపై ఉద్దేశపూర్వకంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. నాగోలు డివిజన్ పరిధి బాలాజీ నగర్ కాలనీలోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న సమయంలో స్కూల్‌కు సంబంధించిన సివరేజీ వ్యవస్థను బుధవారం బ్లాక్ చేస్తుండగా కార్పొరేటర్ అడ్డుకుని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల నిర్మాణ సమయంలోనే సివరేజీ చార్జీలు చెల్లించారని గుర్తు చేశారు. అనుమతులున్నా ఇప్పుడు టీస్ నెంబర్ తీసుకోవాలని జలమండలి అధికారులు బెదిరింపులకు పాల్పడతున్నారన్నారు. సివరేజీ బోర్డు అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో కాలనీలవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, గోపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మలక్‌పేట: ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) బేగంపేట ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. టీటీఐ ఆధ్వర్యంలో బుధవారం మలక్‌పేట యశోద ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి 'రోడ్డు ప్రమాదాలు- నివారణ' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిగ్నల్ జంప్ ప్రమాదకరమని, వాహనాలకు బీమా తప్పనిసరి చేయించాలన్నారు. ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని వివరించారు. సీటు బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీసీపీ దివ్యచరణ్, జనరల్ మేనేజర్ ఆఫ్ ఆపరేషన్ గోపాల్‌రావు, ఏజీఎం హేమ చంద్ర బాబు, మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

### ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన మహిళలు



లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని శాతవాహనగర్ మహిళా సంఘం సభ్యులు బుధవారం ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించి పూల మొక్కను అందజేశారు. కాలనీలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

### నిధులు కేటాయించాలని వినతి



జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: వివిధ కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం తగిన నిధులు కేటాయించాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నాలా పనులు, స్ట్రీట్ లైట్లు తదితర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాగార్జున కాలనీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, క్రిస్టియన్ కాలనీ అధ్యక్షుడు హరిందర్‌రెడ్డి, వెంకటరమణ కాలనీ అధ్యక్షుడు నవీన్, యశోదనగర్ కాలనీ అధ్యక్షుడు యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాలనీల అభివృద్ధియే లక్ష్యం



అల్తాఫ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, కాలనీ వాసులు

లింగోజిగూడ: కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయడమే లక్ష్యమని కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని అల్తాఫ్‌నగర్, శ్రీనివాస్ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, లేకుంటే కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీల వాసులు జనార్దన్‌రెడ్డి, జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేందర్, కిరణ్, శ్రీనివాస్‌గౌడ్, జంగయ్యగౌడ్, షఫీ, సురేష్, రాజు, రవి, నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

### సురభి నాటకోత్సవాలు ప్రారంభం



మాయాబజారు నాటకంలోని ఓ దృశ్యం

వనస్థలిపురం: భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖల సంయుక్త సహకారంతో ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా వినాయక నాట్యమండలి (సురభి) ఆధ్వర్యంలో నాటకోత్సవాలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. వనస్థలిపురం హుడా గ్రౌండ్‌లోని సురభి థియేటర్‌లో ఆరు రోజులు నాటక ప్రదర్శన కొనసాగనుంది. వనస్థలిపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య, ఆర్‌టీవో వేణు ముఖ్య అతిథులుగా హాజరై నాటకాన్ని ప్రారంభించారు. మాయాబజార్ నాటకం వీక్షకులను విశేషంగా అలరించింది. బాలనాగమ్మ, శ్రీనివాస కల్యాణం, శ్రీకృష్ణ లీలలు, చింతామణి, పాతాళభైరవి నాటకాలను రోజుకు ఒక్కటి చొప్పున ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు ఆర్.వేణుగోపాల్‌రావు తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు నాటకం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

### లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లెపాక వీరయ్య

చైతన్యపురి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా చైతన్యపురిలో పెయింటర్స్ అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలన్నారు. ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాలని, హమాలీ, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

### నక్షత్ర హాస్పిటల్‌లో అధునాతన శస్త్ర చికిత్స



బాలనారాయణకు శస్త్ర చికిత్సను విజయవంతం చేసిన డాక్టర్లు

దిల్‌సుఖ్‌నగర్: ఊపిరితిత్తుల సమస్యతో నెలల తరబడి బాధపడుతున్న ఓ వ్యక్తికి వైద్యులు శస్త్ర చికిత్స చేసి విజయవంతంగా పూర్తి చేశారు. ఆర్‌కేపురం హరిపురికాలనీలోని నక్షత్ర హాస్పిటల్ ఎండీ సోమ శేఖర్ రెడ్డి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామాంతపూర్‌కి చెందిన బాలనారాయణ(45) కాలేయ, ఊపిరితిత్తుల సమస్యతో నెలలు తరబడి బాధపడుతున్నాడు. హాస్పిటల్ వైద్య బృందం 8 గంటలు పాటు శ్రమించి క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని ఎండీ తెలిపారు. అతి ఖరీదైన వైద్యాన్ని అతి తక్కువ ఖర్చుకు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు అరుణ్, పవీరణ్, సుధాకర్, నితిన్ ప్రసాద్, చంద్రప్రకాశ్, మహబూబ్ బాషా, నవ్య, సాయినాథ్ పాల్గొన్నారు.